# శిథిల విగ్రహాలు

"గోపాల్‌ను అరెస్ట్ చేశారు."

"అవును పోలీసులు పట్టుకపోయిండ్రట."

"పట్టుకపోరు మరి అయిందాంట్లో కాని దాంట్లో తల దూర్చితే."

"ఆడు చదివే చదువు తక్కువ చదువు కాదులే."

"అతని వాదనలో తప్పేముందో అర్థం కావటం లేదు."

"ఒక వ్యక్తిని ఉట్టిగనైతే అరెస్టు చేయరు కదా."

"అరెస్ట్‌దేముందీ అనుమానం వచ్చిన వాడిని అరెస్టు చేయవచ్చు."

"అనుమానం ఏమీ కాదు. అపరాధమే చేస్తూవున్నాడు."

"అరెస్ట్ చేశారు. స్టేషన్‌కు పట్టుకెళ్ళారట."

"అప్పుడే."

"దళితవాడంతా ఎదురు నిల్చినా ఊర్కోలేదట."

"వాడు చేసిన పనికి ఎవరు ఊర్కొంటారు."

"అసలు ఆ రోజు ముత్యాలమ్మ గుడి కాడనే నర్కి చంపాల్సింది. ఏదో వదిలిపెట్టారు."

"దున్నను నర్కేది వాళ్ళ కులపోడే కదా. మరో పావు ఇస్తే వీన్ని కూడా వాడే నరికేవాడు."

అని మైసమ్మ గుడి దగ్గర కూడిన జనం ఎవరికి తోచింది వాళ్ళు అంటూ ఉన్నారు. ఆ వూరి ఆచార్యులు అప్పుడే అక్కడి నుండి వెళుతూ ఉంటే ఆయన వెనకాల మరో పదిమంది తలొంచుకుని నడుస్తూ ఉన్నారు కాపరి వెంట గొర్రెల్లాగా. ఆచారి మనస్సులో ఓ మాదిరి ఉత్సాహం తొణికిసలాడుతుంది.

"అరెస్ట్‌తోనే ఈ కేసు ఆగిపోవద్దు. వాన్ని జైలు పాలు చేయాలి. లేకపోతే నా కొడుకులు రెచ్చిపోయి గ్రామ దేవతలకు కాదు అసలు దేవతలకే ఎసరు తేవచ్చు అన్నాడు."

"అది అంత సులభం కాదులే" తన వెంట వస్తున్న పెద్ద రైతు.

"ఈ రోజుల్లో ఏదైనా సాధ్యమే" అన్నాడు ఆచారి.

"ప్రజా రాజ్యంలో పదిమందిలో ఆరుగురు ఊ అంటే చాలు. కేసు నిలుస్తుంది." మరొక వ్యక్తి కాస్త వేగంగా ఆచారి వెనక నడుస్తూ.

"ఈ విషయంలో ఎక్కువమంది తిని, తాగేటోళ్ళే. ఈ పండగలుంటేనే వాళ్ళకు అన్నీ దొరుకుతాయి" ఆచారి తన అనుభవసారాన్ని చెప్పాడు.

"ఈ రోజుల్లో కులాలు రాజ్యమేలుతున్నాయి. కులం ప్రేమలో వాళ్ళు వానివైపే పోతే కాలం మారుతున్న విషయం చూస్తూనే వున్నాం" మళ్ళీ తానే అన్నాడు.

"కారంచేడు, చుండూరు విషయం చూశాం" మరో పెద్ద మనిషి.

"అదంతా రాజకీయం" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన మరో జిత్తులమారి సాతాని.

"రాజకీయం కంటే మతం శక్తివంతమైనది. దానిని మించినది ఏదీ లేదు" అన్నాడు ఆచారాలను అమలుపరిచే ఆచారి.

"అయితే పాచికలు వేస్తానంటావు" అన్నాడు జిత్తులమారి.

"పాచికలు వేయటం, ధర్మాన్ని ఓడించటం, ఎదుటివాళ్ళను కష్టాలపాలు చేయటం ఈనాటిది కాదన్న విషయం అందరిక్కీ తెలుసు" అని మార్గోపదేశం చేశాడు కాపలాచారి.

"అయితే ఆట మొదలెట్టండి" అన్నాడు జిత్తులమారి.

"అరెస్ట్‌తోనే మొదలైంది ఆట" అని తనలోనే ఓ పన్నాగాన్ని పన్నాడు ఆచారి. దానితో ఆ ఊరి జనం రెండు భాగాలైపోయారు.

* * *

"గ్రామ దేవతల పండుగలు, గట్టు జాతరలు ఎప్పటినుండో వస్తున్న మన హిందూ సంస్కృతి, మన జీవితంలో ఒక భాగం. వాటినిప్పుడు కాదనటం అంటే మన సంస్కృతినే మనం కాదన్నట్టే. తరతరాల నుండి వస్తున్న ఈ నాగరికతను కాదనటం సంఘ వ్యతిరేక చర్య. సామాజిక ద్రోహం." అన్నాడు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్.

కోర్టు హాలంతా జనం కిక్కిరిసి వున్నారు. న్యాయ పీఠంపై గంభీర ముద్రలో న్యాయమూర్తి. అరవై ఏళ్ళ వయసులో ముప్పది ఏళ్ళనుండి న్యాయ - అన్యాయ వాదనలతో నెరిసిన తల, బంగారు రంగు కళ్ళజోడు, తెల్లని దుస్తులపై నల్లని గౌను. ఎదురుగా టేబిల్‌మీద ఓ గంట సుత్తె. ఎడమవైపు కళ్ళకు గంతలు కట్టివున్న న్యాయదేవత. ఇంకా కలం, కాగితాలు. న్యాయపీఠం వెనుక ఉన్న గోడ గడియారం పదకొండు గంటలు చూపిస్తుంది. కోర్టు హాలంతా నిశ్శబ్దంగా వుంది.

పి.పి. ఎఫ్. ఐ. ఆర్ ను చదవసాగాడు. వయసు ఏబదికి పైనే. నుదుట అడ్డంగా విబూది. నిలువుగా తిలకం బొట్టు. క్రాఫ్‌లోనే కలిసి వున్న పిలక జుట్టు. కుడి ముంజేతికి ఎప్పుడో కట్టినట్టుంది నల్లని రంగు దారం, వెలసిపోయి వుంది.

"ఊళ్ళో జరుగుతున్న ముత్యాలమ్మ పండగను జరక్కుండా చేశాడు ఈయన. గ్రామ దేవత ముందు దున్నను నరక్కుండా అడ్డుకున్నాడు. జీవహింస కూడదని ప్రభుత్వం

చట్టం కూడా చేసింది కాదనలేము కానీ తానే వంగి తనను నర్కమన్నాడు. ఇది ఆత్మహత్యానేరం కిందకు వస్తుందని. తమకు వేరే మనవి చేయవలసిన అవసరం లేదు మైలార్డ్." అన్నాడు.

కోర్టులోని జనం ఆసక్తిగా వింటున్నారు. పోలీసువాళ్ళు కోర్టుకు కాపలా కాస్తున్నట్టు దర్వాజ దగ్గర నిల్చున్నారు.

నల్లకోటు నరులు, అటు పి.పి. వైపు , ఇటు గోపాల్‌వైపు చూస్తూ వున్నారు.

"అంతే కాదు మైసమ్మ గుడి దగ్గర యాటను గావు పట్టనివ్వలేదు. తన కులంవాళ్ళను డప్పు కొట్టనివ్వలేదు. డప్పుల మోతలేంది మనిషి యాట గొంతు కొరకలేడు. ఊరికి కీడు రాకుండా జంతువులను చంపి వాటి పేగుల్లోని కసురును గంపల్లో నింపుకొని,నోట్లో అదే జంతువు దొబ్బను కరుచుకొని, నిమ్మకాయను గుచ్చిన ఛురకత్తిని పట్టుకొని ఊరి చుట్టూ తిరగకుండా అడ్డుకున్నాడు.అంతే కాదు పవిత్రమైన బలి గంపను కింద పడదోశాడు."

అప్పుడు పి.పి గొంతులో ఒకింత తీవ్రత, మరికొంత వ్యంగం కనిపించింది.

క్షణం ఆగి ఓ కరపత్రాన్ని బెంచ్‌క్లర్క్‌కు అందించాడు.ఆ కరపత్రాన్ని న్యాయమూర్తి ముందుంచాడు. న్యాయమూర్తి దానిని చేతుల్లోకి తీసుకొని కళ్ళద్దాలను సవరించుకున్నాడు. కరపత్రాన్ని చూసిన న్యాయమూర్తి చూపులు గోపాల్‌వైపు మళ్ళి , ఆ తరువాత పి.పి. మీద ఆగాయి.

"మహా ఘనత వహించిన న్యాయమూర్తిగారు -

"ఆ కరపత్రం చదివితే అతని ఉన్మాద స్థితి తెలుస్తుంది.

"అజ్ఞానాన్ని పెంచిపోషించే ఈ సంస్కృతి వద్దు. సంస్కృతి పేరుతో డక్కలివాళ్ళు చెప్పే కథలు, వాళ్ళు చెప్పే తెలిసీతెలియని దళితజాతుల పుట్టుపూర్వోత్తరాలను, పూర్వపు అనాగరిక పద్ధతులను చూపించి ఇప్పటి నాగరికుల ముందు ఉంచటం, పొట్టకోసం, బట్టకోసం పదోచ్చారణ కూడా తెలియని పుక్కిటిపురాణాలుగా సేకరించిన యక్షగానాలను నగరపు నాగరీకుల మధ్య చిందువాళ్ళ ప్రదర్శనలను ఏర్పాటు చేసి దళిత దరిద్ర నారాయణుల భాషావేషాలు ఇవే అని చూపడం అవమానం కాదా ? అంత చేసినా వాళ్ళకు మిగిలేది ఆకలి, అడుక్కుతినటమేనా? పోతే. దానిని ఇంకా కొనసాగించాలా? ఒకవేళ మంచిదే అయితే దానిని వాళ్ళే ఎందుకు చేయాలి? మిగతావాళ్ళు కూడా ఎందుకు చేయరు ? మీ దేవతలకు మీరు కొబ్బరికాయలు కొడతారు. గ్రామ దేవతలను వీళ్ళ పాలిట నెట్టి రక్తాన్ని చిందింపచేస్తారా ? ఎప్పటినుండో వస్తున్న ఈ మూఢాచారాలను ఆపివేయకూడదా" అని ప్రతి ఒక్కరిని ప్రశ్నిస్తున్నాడు ఈ గోపాల్. ఈ ముద్దాయి, ఎన్నో సామాజిక నేరాలు చేస్తూ వస్తున్నాడు. వీటన్నిటిని కోర్టువారి పరిశీలనకై సమర్పిస్తున్నాం అని మరికొన్ని కాగితాలను,

ఫోటోలను న్యాయమూర్తి ముందుంచాడు. న్యాయమూర్తిలో తీవ్ర స్పందన కలిగినట్లు వారి ముఖ కవళికలు చెపుతున్నాయి.

* * *

కోర్టు గడియారం చిన్నముల్లు రెండుమీద, పెద్దముల్లు పన్నెండు మీద వుంది. కోర్టు హాల్లోని బోనులో గోపాల్‌ను నిలబెట్టారు. బక్కపలచని ఆ వ్యక్తికి పాతికేళ్ళుంటాయి. తక్కువరకం జీన్స్‌పాంట్, మామూలు టీ షర్ట్ వేసుకుని ఉన్నాడు. జేబుకు రూపాయి విలువ గల బాల్‌పెన్ను, పాదాలకు కాన్వాసు షూ వేసుకొని ఉన్నాడు. మబ్బులను ఛేదించుకు వచ్చే సూర్యునిలా అతని ముఖంలో కొత్త కొత్త ఆలోచనల ఛాయలు.

నల్లకోట్లవాళ్ళు అతనిని పరీక్షగా చూస్తున్నారు. అతని తాలూకు చుట్టపక్కాలు, అతని గ్రామస్తులు అతని వైపే చూస్తున్నారు.

"మీ పేరు గోపాలే కదా?" అని అడిగాడు పి.పి.

"అవును" అన్నట్టు తలాడించాడు బక్కపలుచని యువకుడు.

"గోపాల్ గారు మీరేం చేస్తుంటారు?"

"చదువుకుంటున్నాను."

"ఏం చదువుతున్నారు?" అడిగాడు పి.పి. 'చదువు ఆపేసిన వాడిలా వున్నాడు' అని మనస్సులో అనుకుంటూ.

గోపాల్ పి.పి.ని మౌనంగా చూశాడు. అతని మౌనాన్ని గ్రహించిన పి.పి. గారు -

"ప్లీజ్ అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చి కోర్టువారికి కోపరేట్ చేయాలి." అంటూ బోను దగ్గరికి వెళ్ళి బోను కర్ర మీద ఓ చేయి ఆనించాడు పి.పి.

గోపాల్ మౌనంగా న్యాయమూర్తి వైపు చూశాడు. ఆ చూపులో ఎన్నో అనుమానాలు ట్రాన్స్‌మిట్ అయ్యాయి.

న్యాయమూర్తి ఆసక్తిగా గోపాల్‌వైపు చూస్తూ "ప్రశ్నలకు జవాబు చెప్పండి." అని తిరిగి పి.పి. వైపు చూస్తూ -

"ప్రొసీడ్ అన్నాడు న్యాయమూర్తి."

"ఎం.యస్.సి ఫిజిక్స్ చదువుతున్నాను " అన్నాడు.

అది విన్న పి.పి. ఓ సారి తనలోతానే ఏదో అనుకుని తలొంచుకుని "మీ మీద మోపబడిన అభియోగాలు విన్నారు కదా " అన్నాడు గోపాల్ ముఖంలోకి చూస్తూ. ఆ చూపులో సూటి - పోటీతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

అప్పుడు గోపాల్ ముఖంలో ఏవో తీవ్ర రూపం దాల్చుతున్న అనేక ప్రశ్నల పరంపరలు

కదులుతున్నాయి.

"విన్నాను" అన్నట్టు తలాడించాడు. ఆ మౌనపు మాటలోని దృఢత్వం అక్కడున్న వాళ్ళను ఆశ్చర్యచకితులను చేసింది.

"వాటికి మీ సంజాయిషి కోర్టువారి ముందుంచడం అవసరం. చెప్పండి" పి.పి.

"సంజాయిషీ ఏముంది. జరిగినవే" అన్నాడు ఉదాసీనంగా చూస్తూ.

"జానపద సంస్కృతిని కాదనటం నేరం కదా."

జవాబు ఏమిస్తాడో అని న్యాయమూర్తిగారు ఆసక్తిగా మోచేతిని టేబిల్ మీద వుంచి అరచేతిని చెంపకానించి వింటున్నాడు. కోర్టుహాలులో వున్న అందరూ అదేస్థితిలో వున్నారు.

"మారుతున్న నాగరికతకు మసి పూయలేం. కాలం వేగంగా పరిగెత్తుతూ మనలను తనతో నడవమనటాన్ని మనం గుర్తించాలి" అన్నాడు గోపాల్ పి.పి. వైపు చూస్తూ.

"మీరు గ్రామ దేవత ముందు దున్నను నర్కొద్దు అని అడ్డుకున్నారు. అంతే కాదు నన్ను నర్కండి అని కూడా అన్నారట."

"అవును" అన్నట్టు తలాడించాడు. అప్పుడు కొందరికి ఏసు గుర్తొచ్చాడు. ఆ నిజాయితీకి న్యాయమూర్తి కొంత కదిలి కూర్చున్నాడు. హాల్లోని నల్లకోట్లన్నీ అటు ఇటు కదిలాయి.

"అదే జరిగి వుంటే" అని న్యాయమూర్తి వైపు చూశాడు పి.పి. బోను దగ్గరనుండి కొంత ముందుకు జరుగుతూ.

"ఒకరు చస్తే ఆ నమ్మకానికి వందమంది సిద్ధం అవుతారని చరిత్ర చెప్పటం

లేదా?" అంటూ ఎదురుగా వున్న నల్లకోట్లవైపు చూశాడు. వాళ్ళు తీక్షణంగా గోపాల్నే చూస్తున్నారు.

"అయినా దున్నను నరికేది నా తండ్రి. నరకడానికి ఆయత్తం చేసేది డప్పుల మోత. ఆ రోజు డప్పులే శబ్దం చేయలేదు. మా నాన్న కత్తిని లేపనెత్తలేదు" అన్నాడు మాములుగా. అయినా చూపులో ఏదో నమ్మకం, మరేదో మనోధైర్యం వున్నాయి.

"అంటే మీరు చూపే ప్రొటెస్టుకు మీ వాళ్ళ సపోర్టు వుందన్న మాట. న్యాయమూర్తిగారు ఈ పాయింట్ను దయచేసి నోట్ చేసుకోవాల్సిందిగా మనవి. తానే కాకుండా తన వాళ్ళందరిని సంఘ వ్యతిరేకులుగా తయారు చేస్తున్నాడు. తరతరాల నుండి వస్తున్న సంస్కృతికి మంగళం పాడాలని చూస్తున్నాడు." అన్నప్పుడు క్రాపు కంటే పొడవైన ఆయన జుట్టు అటు ఇటు కదిలింది.

న్యాయమూర్తి టేబిల్మీద కాగితం కదిలింది.

"మీ మీద ఇంకా ఇంకా నేరారోపణలు ఉన్నాయి." అంటూ తన చేతిలో మడిచి వున్న ఫైల్‌ను విప్పిచూస్తున్నప్పుడు-

"నీ చదువు నీవు చదువుకోక ఈ విషయాలన్నింటిని ఎందుకు పట్టించుకోవటం. ఈ ఆచారాలన్నీ నిన్నమొన్నటివా" అన్నాడు పి.పి. అప్పుడతని ముఖం విసుగ్గా, మాట బొంగురుగానూ ఉంది.

"తరతరాలనుండి వస్తున్న ఆచార వ్యవహారాలు" అన్నారు ముందు వరుసలో కూర్చున్న వారొకరు.

అది విన్న న్యాయమూర్తి "ఆర్డర్ ఆర్డర్" అని సుత్తెను ఉపయోగించాడు. చూపును జనం వైపు మరల్చాడు.

"ఒకరు ఏడుస్తుంటే మరొకరు నవ్వడం ఆచారమా? అదే ఆచారమైతే దానిని ఇక మీదట కొనసాగించటం కుదరదేమో. అంతా కావాలనుకుంటే ఇప్పటివరకు వీళ్ళు చేశారు. ఇక నుండి అవే పనులను మీరు చేయండి" అన్నాడు అప్పుడతని ముఖం ఎర్రగా మారింది. తన చేతులు పిడికిళ్ళుగా మారుతూవుంటే, వాటిని బోను కర్ర మీద అనించి వుంచాడు.

"చూశారా మైలార్డ్ ఆ పనులు మేమే చేయాలట. వాక్స్వాతంత్ర్యము వుందని ఎలా అంటున్నాడో చూడండి. కోర్టులోనే ఏంత అవమానపరుస్తున్నాడో" అంటూ ఉద్రేకంతో వూగిపోయాడు. కోర్టు హాలులో కూర్చున్న కొంతమంది ఒక్కసారే కదిలి కూర్చున్నారు. గుసగుసలు, కోపపు శ్వాసలు ఒదిలారు. వాతావరణం వేడెక్కిపోయింది.

అది గ్రహించిన న్యాయమూర్తి ముందుకు వంగి, టేబిల్‌మీద రెండు చేతులను ఉంచుతూ

"మీ తరపున వాదించటానికి వకీలు ఎవరైనా వున్నారా?"

'లేరు' అన్నట్టు తల అడ్డంగా వూపాడు.

"మీకు కావాలంటే ప్రభుత్వ ఖర్చులతో వకీలును నియమిస్తాం" అన్నారు న్యాయమూర్తి

'గోపాల్ ఆలోచనల్లోకి వెళ్ళాడు -

'తన తరపున ఏ వకీలు వాదిస్తాడు. తాను, తనవాళ్ళు భరిస్తున్న బాధలు ఎదుర్కొంటున్న అవమానాలు, అణచివేతలు ఎవరెకెరుక. సంస్కృతి పేరుతో ఇప్పటికి తనవాళ్ళను అనాగరికులుగా, ఆకలి బాధితులుగానే వుంచుతున్నారు. తరాల తరువాత ఈ మధ్య ప్రభుత్వసహాయం వల్ల కాస్త ముందడుగు వేసినా మత కట్టుబాట్లతో, ఆచారాల హద్దులతో మళ్ళీ వెనక్కు నెట్టేయబడుతున్నారు. పండుగలు చేయమని పదిరోజుల గాసాన్ని ఒక్కరోజులోనే ఖర్చు చేసేటట్టు, లేదా అప్పైనా చేసి తిని తాగి వెర్రి బాగులుగ చిందులేసేటట్టు చూస్తూ వున్నారు. తాము మాత్రం తప్పతాగటం నేరం అని గీతలు గీసుకొని వుంటారు. ఊరన్నప్పుడు చావులు తప్పవు. వాళ్ళను పూడ్చక తప్పదు. బ్రతికి వున్నన్నాళ్ళు

స్నానాలు-జపాలు వ్రతాలు-నోములూ చేసి కట్నకానుకలు ఇచ్చి పుచ్చుకున్న వాళ్ళు చనిపోగానే ఎవర్ని ఎవరు పట్టించుకోకుండా మోసుకొచ్చి స్మశాన వాటికల్లో పడవేస్తే - బొంద తవ్వి పూడ్చేది, చితికి నిప్పంటించి తిరిగి చూడకుండా పోతే కాలిందాక కాపలా వున్నప్పుడు కలిగే భయాన్ని తట్టుకోవడానికి తాగుడును ఆశ్రయించక తప్పదు. ఆ పని చేయకుంటే తాగుడు అవసరం లేదు. అందువల్ల ఆ పనుల నుండి వీళ్ళు తప్పుకోవాలి. ఎవరి చావు వాళ్ళ సంబంధీకులే చివరి వరకు చూసుకోవాలి. ఇకపోతే గంగెద్దులవాని, బాలసంత వాని పరిస్థితి దయనీయం. కళలు, కళారూపాల పేరుతో విచిత్ర రాతి యుగం నాటి పాత సంస్కృతినే పట్టుకొని కూర్చోవాలంటారు. చిందువాళ్ళ చిందేసి ఆడవలసిందే. పట్ట పగలే వీధి భాగవతుల ప్రదర్శనలచే జనాన్ని ఆనందపరచవలసిందే. చిందు ఆడవాళ్ళు కథ నడుపుతారు. ప్రేమను, కోపాన్ని, తాపాన్ని మద్దెల దరువుకు, తాళం చప్పుడుకు అనుగుణంగా కదిలి ఆట కట్టిస్తారు. అది చూసి ఆనందభరితులై, వాళ్ళతో శృంగారాన్ని కూడా నడుపుతారు ఊరి పెద్దలు. ఎవ్వరైనా కాదంటే కళ్ళెర్ర చేస్తారు. జానపద కళల పేరుతో దళితులని దళితులుగానే బతకమంటున్నారు. ఈ చదువు సంధ్యలు లేని అమాయకులు పదాలను పలకడం తెలియక అపశృతులు పలుకుతూ, పద్యాలు పాడుతూ వుంటే గ్రామ పెద్దలనే వారు హాస్యం చేస్తూ నవ్వుకుంటారు. ఎల్లమ్మను ఒకవైపు నుండి దేవతా స్త్రీగా ఆమోదిస్తూ దానికి పెళ్ళి చేయొద్దని తమ కామ వాంఛలు తీర్చుకోవడం లేదా. ఊరు పచ్చగుండాలి, ప్రకృతి శక్తులను తృప్తి పరచాలని దళితుల కన్నెలను జోగినులుగా, బసవమ్మలుగా మార్చి వాళ్ళతో శృంగారం నడపటం ఎక్కడి ఆచారం. అదే ఓ ఆచారమైతే ఊరిమంచికే అయితే మిగతా కులాల కన్నెలను ఎందుకు వదలటం లేదు? ఇలాంటి విషపూరిత సంస్కృతి నుండి వాళ్ళను ఎవరు గట్టెక్కిస్తారు. ఇలాంటి వారి తరపున ఎవరు వాదిస్తారు. ఇప్పటి వకీళ్ళుగా స్థిరపడిన వాళ్ళలో దళితులు ఎంతమంది ? డప్పు వాయించటం, బూట్ పాలిష్ చేయటం నీచమైన వృత్తులే అనే స్పృహ కలిగే విధంగా ప్రవరిస్తుంటే ఎంత బాధ. ఆ మధ్య రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయంలో విద్యార్థులంతా రోడ్లెమ్మటి బూట్ పాలిష్ చేయటం జరిగింది. దాని వుద్దేశ్యం ఏమిటి? రిజర్వేషన్ కొనసాగితే మేధావులకు ఈ గతి పడుతుందనే కదా. బూట్ పాలిష్ చేయటం మొదటినుండి వీళ్ళకెందుకు అంటగట్టారు. చాకిరీ చేయించుకుంటూనే చాకిరీ వాళ్ళను నీచంగా చూడడం ఎంతటి అమానవీయ చూపు.

ఈ రకంగా వృత్తుల పేరిట, కళల పేరిట ఏదో ఒకరకంగా అవమానపరుస్తూనే వున్నారు. ఊళ్ళో పేరు పెట్టి పిలవరు. పట్టణాలలో నాగరికత నయవంచనలు. వేదికల మీద ఇంటర్ కాస్ట్ మారేజీలు జరగాలని ఉపన్యసిస్తారు. కాలేజీల్లో పిల్లలు కలుసుకొని మాట్లాడితే హత్యలు చేయిస్తారు. మంచి బట్టలేసుకుంటే ఓర్వలేరు. గిల్లికజ్జాలు పెట్టుకుంటారు. ఎదిరిస్తే ఊరును చుండూరులాగా మారుస్తారు. అకారణంగా నరమేధం కావిస్తారు. మాట పెరిగితే చూస్తూ చూస్తూ నరికి చంపటం, ఇళ్ళకు నిప్పెట్టించటం, ఇది

ఎక్కడి సంస్కృతో అర్థం కాదు. పొలాల్లో పండిస్తూ ఇంటి చాకిరీ చేస్తూ వచ్చిన కోటేష్‌ను సజీవ దహనం చేయవచ్చా. చేయరాని నేరం చేశారని మందిని చంపి అదే నేరానికి కారణమైన మరొక వ్యక్తిని తన ఇంట్లోనే దాచుకుంటున్న తన మనిషిని ఎందుకు కాపాడుకుంటారు? మన దేశ సంస్కృతికి కాపలా కాస్తూ తూచ తప్పకుండా అనుసరిస్తున్న వాళ్ళనే నర్కడం, చంపడమూనా. స్వరాజ్యం వచ్చి ఏబది ఏండ్లు గడిచినా అందరం ఒకే చట్టం కింద సమాన హక్కులు గల సమాజంలో జీవిస్తూ ఒక కులాన్ని మరొక కులం శాసించటం, అణచి వుంచటం, ఏ సంస్కృతికి చెందిన విధానం ? ఈ కుల చీలికలు ఇంకెన్నాళ్ళు? జాతీయ భావాన్ని ఎలా పెంచుతారు? గతంలో అందుకే ఈ దేశం ఎన్నోసార్లు అపజయం పాలై పరాయిపాలనకు గురై సంపదనంతా పోగొట్టుకుంది.

మను శాసన ప్రకారంగా ఐదు కులాల ఆచార వ్యవహారాలను పాటిస్తూనే మనం అందరం సమానమే అనడం ఎంతవరకు సబబు? ప్రజాస్వామ్యంలో అసమానతలు ఉండకూడదు అని వాదించే ఓ వకీలు కావాలిప్పుడు అని అనుకుంటున్నప్పుడు -

"ఆ చెప్పండి. వకీలును ఏర్పాటు చేయమంటారా?" మళ్ళీ అడిగాడు న్యాయమూర్తి.

గోపాల్ వెంటనే తన ఆలోచనల నుండి తేరుకొని మరొకసారి ఆలోచించి 'అలాగే' అన్నట్లు తల ఊపాడు.

*　　*　　*

మరునాడు కోర్టు నడుస్తూనే వుంది.

గ్రామ పెద్ద ఆచారి గారు బోనులో వున్నారు. ఆయన పుట్టి బుద్దెరిగిన నాటి నుండి బోను ఎక్కలేదట. ఈ కేసులో తప్పలేదు. ఆయన నిండు శరీరానికి పలుచని ధోతి, అంగి ధరించాడు. ఎదమీద యజ్ఞోపవీతం, మెడలో రుద్రాక్షమాల, నదుట తిలకం, దానికిరువైపులా 'యు' ఆకారంలో విబూది నామం. రెండు రంగుల కలనేతగా జుట్టు. ఎందుకో ఆ ముఖం వివర్ణమైంది. ఫ్రిజ్‌లో నుండి తీసిన సంత్రపండులాగా ఆయన ముఖం. "ఆచారి గారు మీది గోపాల్ ఊరే కదా" అని అడిగాడు గోపాల్ తరపున నియమింపబడిన వకీలు సత్యం.

"గోపాల్‌దే మా ఊరు" అన్నాడు ఆచారి. అప్పుడు ఆయన ముఖంలో ఆత్మన్యూనతా భావం కదిలింది. ఎప్పుడో వేసుకున్న తాంబూలం తడి ఆరిపోయింది.

సత్యానికి నవ్వొచ్చింది. న్యాయమూర్తి కూడా లోలోన నవ్వుకున్నాడు అది విని.

"మీరే కదా కేసు పెట్టిచ్చింది" వకీలు సత్యం ప్రశ్న. సత్యానికి నాలుగు పదులు నిండాయి. చలాకీ మనిషి. ఆయన మాటలను మాత్రల్లాగా వాడుతాడు.

"నేనొక్కణ్ణే కాదు. ఊరంతా కలిసి" అన్నాడు ఆచారి గారు న్యాయమూర్తివైపు చూస్తూ.

"ఊరంతా అయినా, ఒక్కరైనా ఇది కంప్యూటర్ యుగమని గుర్తుంచుకోవాలి" అన్నాడు సత్యం తన కనుబొమలను కదిలిస్తూ.

ఆచారి తలవంచుకొని నిల్చున్నాడు. తాను పన్నినపన్నాగాలను తలుచుకొంటున్నట్టుంది.

"మైసమ్మ,ముత్యాలమ్మ గుళ్ళ దగ్గర కోళ్ళను, మేకలను, దున్నలను నర్కిస్తున్నారని ఆ వూరి దళితులు మీమీద అంటున్నారు. ఇదిగో" అంటూ తన ఫైల్లోనుండి కొన్ని కాగితాలను తీసి న్యాయమూర్తి ముందుంచాడు.

"రామ, రామ నేనేమన్నా మాంసాహారినా ?" అన్నాడు లెంపలేసుకుంటూ. ఆ ముఖానికున్న చెమట చేతులకు అంటగా దానిని భుజం మీదున్న శాలువకు అద్దుకున్నాడు.

"గ్రామ దేవతలకు పండగలు చేయటం మన ఆచారమని అంటున్నారు కదా, ఇక ఇప్పుడు చేస్తున్న వాళ్ళు ఆపేస్తారట. ఇకనుండి వాటిని కాపాడటం కోసం మిమ్ములను సిద్ధంకమ్మంటున్నారు మీరేమంటారు? " అంటూ కుడిచేతిలోవున్న ఫైల్తో ఎడమ చేతిలో కొట్టుకుంటూ ఓసారి కళ్ళుమూసి తెరిచాడు.

"రామ, రామ ఆ ఛండాలపు పనులు మేం చేయాలా ? కాస్త కోపంగా అన్నాడు."

"కోపం తెచ్చుకోకండి. ఇతరులు చేస్తే అది మంచిపని, ఆచారం. మీవరకొస్తే అది ఛండాలపు పనీ". న్యాయమూర్తి వైపు మళ్ళి "మైలార్డ్ ప్లీజ్ దీన్ని నోట్ చేసుకోవలసిందిగా మనవి" అన్నాడు సత్యం .

అప్పుడు కోర్టు హాలులో వున్న వాళ్ళు రెండు భాగాలుగా విడిపోయిన కదలికలు. ఇంతవరకొచ్చిందా అన్న నిట్టూర్పులు, సరే చూద్దాం అన్న శ్వాసలు !

న్యాయమూర్తి కలం కదిలింది.

"ఇదే విషయంలో నా క్లయింట్ గోపాల్ ఓ అర్జీని కోర్టువారికి సమర్పించుకుంటున్నారు దానిని పరిశీలించవలసిందిగా మనవి."

అంటూ ఓ కాగితాన్ని న్యాయమూర్తి ముందుంచాడు. దానిని న్యాయమూర్తి తనచేతుల్లోకి తీసుకున్నారు.

అది లంచ్ టైమ్. -

న్యాయమూర్తి లంచ్ చేసుకొని రిలాక్స్డ్‌గా కూర్చున్నప్పుడు 'గోపాల్ అర్జీ' గుర్తొచ్చింది.

'ఈ పండగలన్నీ ఒకప్పటి అటవిక సంస్కృతికి చెందినవి. వాటిని ఇప్పటి వరకు కొనసాగిస్తూ వస్తున్నారు. గ్రామాలలో ఏ ఇతర కులాలు చేయని వాటిని, వాళ్ళన్న మాటలలో "ఛండాలపు" పనులను దళితులతో చేయిస్తూ ఉన్నారు.. ఈ ఆచారాలను ఆచరించటం వల్ల అటు మానసిక వికలాంగులు గాను, ఇటు ఆర్థికంగా బలహీనులుగాను అవ్వడమే కాకుండా అదే మంచిదని గుడ్డిగా నమ్ముతున్నారు. తాము తిండి, బట్టకు

ఉపయోగించుకోవలసిన డబ్బులను దీప, ధూప, నైవేద్యాల కింద అగ్గిపాలు చేస్తున్నారు. అప్పుల పాలవుతున్నారు.

ఆ పండుగల పేరుతో బాగ తాగి తందనాలు ఆడడం వల్ల వాళ్ళ ఆరోగ్యం చెడి, నరాల బలహీనత వచ్చి ఏ పని చేసికోలేక పోతున్నారు. కాలేయం పాడై, కంటి చూపు పోయి కూడు-గుడ్డకు కరువై అకాలమరణం పాలవుతున్నారు. ఆ అర్థాంతపు చావులనుండి వీళ్ళను రక్షించవలసి వుంది.

ప్రభుత్వం ముందడుగు వేయించడానికి ఎంత ప్రయత్నం చేస్తున్నా మూఢనమ్మకాల వల్ల అది తప్పటడుగుగానే పడుతుంది. తడబాటులేకుండా వాళ్ళలో మనోధైర్యాన్ని పెంచవలసి వుంది.

ఉచిత విద్యావకాశాలు కల్పించినా కుటుంబ పరిస్థితుల కారణంగా ఎక్కడో ఒకచోట ఆగిపోయి మళ్ళీ తాపీ మేస్త్రీ గానో, రిక్షా పుల్లర్ గానో మిగిలిపోతున్నారు. అట్లా కాకుండా చుట్టూరా వున్న సమాజం చూడవలసి వుంది. డక్కలి, చిందు వాళ్ళు ఇంకా వాళ్ళ కులవృత్తిని వదలలేకపోతున్నారు. అదే ఓ గొప్ప కళగా వాళ్ళు భావిస్తున్నారు. కారణం వాళ్ళకు పదో, పరకో ఇచ్చి అదేపనికి ప్రోత్సహిస్తున్నారు. అన్యం - పుణ్యం తెలియని అమాయకులు బాగుపడాలనే కదా ఎ.బి.సి.డి. ఈ. ల ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఆ వివరాలు మనం వాళ్ళకు తెలియ చేయవలసి వుంది. వాళ్ళకు అక్షరాలు నేర్పవలసి ఉంది. వీళ్ళేకాదు, ఈ దేశంలో ప్రతి పేదవానికి ఈ దేశసంపదలో ఎవడి వంతు వాడికి చెందేటట్లు చూడవలసిన బాధ్యత ఇంతకు క్రితమే అనుభవిస్తున్న వారిపై ఉంది. అంతే కాదు, వాళ్ళను మూఢనమ్మకాల నుండి యువతరాన్ని దారి మళ్ళించి అంబేద్కర్ అడుగుజాడలలో నడిచేటట్లు చూడవలసి వుంది.

ఆ అర్జీలోని అంశాలు గుర్తుకురాగానే న్యాయమూర్తి ఆలోచనలు వేగంగా పనిచేస్తున్నాయి. పరిపరివిధాలుగా ఆలోచించాక గోపాల్ ప్రతివాదన నిజమే అనిపించింది. అంతే కాదు ఎలాగో జంతుబలి కూడదు అని ఓ యాక్ట్ వుండనే వుంది. మిగతా విషయాలను నిషేధిస్తూ, జంతు బలి యాక్టును చాలా స్ట్రిక్ట్‌గా ఆచరణలో పెడితే సరి పోతుంది. అడ్డంకులు కలిగించిన వారికి ఆరునెలలు జైలు శిక్ష. ఇదే తీర్పు అంటూ కోర్టుహాలులోకి వెళ్ళి న్యాయపీఠం మీద కూర్చున్నారు. గోపాల్‌ను వదిలి, మూఢాచారాలను ప్రోత్సహించటం వల్ల ఆచారికి 'ఆరునెలల జైలు' అని తీర్పు చెప్పారు.

బొమ్మ చేతిలో తరాజు అప్పుడు సమంగా వుంది.

ఫిబ్రవరి - 2000 •